# దారా

ఆ యిల్లు సింగారించిన సీమంతినిలా చూడముచ్చటగా వుంటుంది. సౌభాగ్య చిహ్నంగ అలంకరించిన పసుపు కుంకుమలతో పట్టుచీర సింగారించి తలలో పూలు తురిమి యింపుగా రవళించె గంటల మొలనూలుకు తోడుగా , ఘల్లుఘల్లుమనే అందెల రవళితో రాయంచలా నడిచి వస్తున్న సంపన్న కుటుంబినిలా వుంటుందా యిల్లు. ఎంత వెదికినా ఎక్కడా కొరత కనిపించని ఇల్లది.

సంపత్తి హోదాలు రెండూ అహమహమికతో పోటీపడుతూ ఆ గృహలక్ష్మి అభిముఖ్యాన్నీ భజిస్తూ వచ్చి ఆశ్రయించినట్లున్నాయి.

ఉదయం యజమానులు లేచిందే తడవు. భయభక్తులతో మెదిలే తాబేదార్లు, మంగళ గీతాలూ, సలాములూ, దండాలూ, దండకాలూ, ఆ తరువాత బారులు తీరిన బొగ్గురు పక్షుల్లా, మంత్రాక్షతల తో, బ్రాహ్మణులూ, వారి తీర్థ ప్రసాదాలు, శుభాశీస్సులు, ఆపైన వందిమాగధులూ, యాచకులూ, ఆపన్నులూ, విన్నపాలు అందరిపైన శేషతల్పశాయి శ్రీమహావిష్ణువు చల్లని చూపులా, ఆయింటి యజమాని అనుగ్రహ వీక్షణం. అందిరికీ చిరునవ్వుల చిన్ని కానుకలు. ఇలా తన చూపులకు అందినంతమేర ప్రసన్నతలు తాండవిస్తూనే వుంటాయి. అసంతృప్తి ఆ దరిదాపుల్లోనే కనిపించదు. ఏమి నోము ఫలమో కాని కన్ను కుట్టే వైభవం అది.

అన్నట్లు చెప్ప మరిచాను. ఆ యజమానికి ఎదిగిన సాలవృక్షల్లా యిద్దరు కొడుకులు. వీరిద్దరికి తోడుగా బలరామకృష్ణులకు ముద్దుల చెల్లెలిలా వో మురిపాలమూట సుభద్ర. కాపరానికొచ్చి కడుపు పండిన అపరంజి బొమ్మల్లాంటి యిద్దరు కోడళ్లు. బంతి చెండ్లలా యిద్దరు మనవలు. వెన్న ముద్దలా వో మనవరాలు. యిల్లంతా నవ్వుల సందడి.

ఆ యింటి యజమానురాలు అరకాసు బిళ్లంతటి నుదుటి కుంకుమతో, ఎల్లవేళలా పీతాంబరాల్లో పొదిగిన గౌరీదేవిలా కళకళలాడుతూ నిండుగా వుంటుంది.

తెల్లవారుతూనే కోడళ్లిద్దరూ అహమహమికతో వచ్చి అత్తగారికి పాదాభివందనం చేసి 'దీర్ఘసుమంగళీభవ' అనే దీవెన పొందుతారు. ఇంతలోకే పరుగు పరుగున మనవలూ, మనవరాలూ వచ్చి ముద్దుల వర్షం గుప్పిస్తారు. తెచ్చికోలు విసుగుతో, వుండండిరా! మీ ఆగడం చల్లగుండ ! అంటూ నడుస్తున్న గుమ్మడి పండులా వున్న చిన్న మనవరాలిని వొళ్లోకి తీసుకుని, ముద్దుల్లో ముంచెత్తుతుంది నానమ్మ.

అది చూచి, యీర్ష్య పట్టలేని రెండో చిన్నవాడు నానమ్మను చూస్తూ -

'నానమ్మో! యీ 'ఆచిలు' (అంటే చిన్నదాని ముద్దుపేరు) లాలలు పోచోనే లేదు. చెడ్డీ ఏచోలేదు. చూడు! చేం! చేం! పపీచేం! అంటూ మెల్లిగా నానమ్మ వొడికి చేరుకుంటాడు.

నానమ్మ యావత్తు తన సామ్రాజ్యంగా, తన ఏలుబడిలోని భోగసీమగా ఏలుతున్న చిన్నది, తన నానమ్మ, పక్కన చేరుతున్న చిన్నవాడిని దూరం తొలగిస్తూ మరింత గట్టిగా చుట్టుకుని-

'నానమ్మ నాయ్! తాతయ్యనాయ్! నీయి కాదు పో' అంటూ ఏకఛత్రాధిపత్యాన్ని ప్రకటిస్తుంది పాప.

ఇంకాస్సేపు వూరుకుంటే పెద్దవాడు కూడా చేరి మంచం పీకి పందిరి వేస్తారనే భయంతో వాళ్ల వాళ్ల అమ్మలు వచ్చి బుజగరింపులతో, బెదిరింపులతో పిల్లలను తీసుకుని వెళ్లుతారు.

యజమానురాలు సంతృప్తిగా లేచి అవసరాలు తీర్చుకుని కోడళ్లకు వంటా వార్పులు పురమాయించి, పూజకు అవసరమని చెప్పగానే పూజగదిలోకి వెళుతుంది. మేళవించిన వీణలా, అపశ్రుతి వినిపించకుండా సాగుతూ వుంది ఆ సంసారం.

ఆ యింటికి దిష్టిబొమ్మలా, వో చిన్నపాటి గుఱ్ఱం అంత ఎత్తులో వో, కుక్క ఎప్పుడూ కాపలాగా వుంటుంది. ఆ కుక్కను యింటి యజమానురాలు అంటే నానమ్మా, పిల్లలూ, 'రేసర్' అంటూ పిల్చుకుంటారు. తక్కిన వాళ్లంతా 'దారా' అంటూనే వ్యవహరిస్తారు. ఆ కుక్కగారు 'దారా' గానే ప్రసిద్ధులు. 'రేసర్' వారికి ముద్దుపేరు. అది కొందరికి మాత్రమే సొంతం. ఎవరినైనా చీల్చి చెండాడవలసి వచ్చినప్పుడు 'రేసర్' అంటేచాలు. ఆ పని తీరిపోతుంది.

ఆ యింట్లో దారా సకల రాజోపచారాలూ అనుభవిస్తూంది. ఒక్కొక్కప్పుడు యజమానికైనా సపర్యలు చేయడంలో యింటివారూ, పరిచారకులూ పాలు మల్తారేమో ? కానీ దారాగారికి ఏ రోజు, ఏ పూట, ఏ నిమిషం ఏవిటమిన్లు, టానిక్కులూ, పాలూ, గ్రుడ్లూ, మాంసం, మందులు, ఏ ఏ మోతాదులో యివ్వాలో అవన్నీ ఏమరుపాటు లేకుండా, క్రమం

తప్పకుండా టంచన్‌గా జరిగిపోతుంటాయి. దారా అందరివాడు. దారా తనలాంటి వారితో సపర్యలు చేయించుకోవడమే ఒక విశేషం. అలాంటి దారా వుండే యింట్లో తానూ వున్నానని చెప్పుకోవడంలో ఎంత గౌరవమూ, గర్వం వుందో? అంటూ పనిపాటల వాళ్లు భావిస్తుంటారు. దారా ఒక ప్రెస్టేజి సింబల్.

ఆయింటికి దారా సర్వరక్ష. ఇరవైమంది అంగరక్షకుల పెట్టు. కొత్త వాసన పట్టి భౌ మన్నదంటె ఆగంతకుడి గుండెలు జారి నోట్లోకి రావలసిందే!

షికారు మూడ్‌లో వున్నప్పుడు 'దారా' ను చూసి తీరాల్సిందే. దూరం నుండే సుమా! అప్పుడు పంజా విప్పి లంఘించడానికి సిద్ధంగా వున్న సింహపు పిల్లలా కన్పిస్తోంది.

ఐనా తన వారిని పువ్వుల్లా కాపాడుకుంటుంది. అందరికన్నా చిన్నది, ఆ యింటికి తనలానే మహారాణి, దారా చెవులు పట్టి సవారీ చేస్తుంది. రెండు కాళ్లపై నడిపిస్తుంది. ఇది ఆ యిద్దరి అన్యోన్యం.

దారా విశ్వాసానికి పెట్టింది పేరు. ఇప్పుడు మనం, పరదాలలోపలికి వెళ్తున్నాం. అందుకే దారాగారిని రేసరు అంటూనే పిలవాలి. ఇక్కడ రేసరుగారు అలకలు, పోతారు, నజ్జులు తొక్కుతారు. నఖరాలు చేస్తారు. గారాలు పచరిస్తారు. ఈ సాగుబాటు కంతటికీ ఆవాస భూమి పెద్దమ్మ గారు. అందుకే రోజుకు ఒకసారైనా, రేసరు వెళ్లి నానమ్మగారికి కనిపించిరావాలి. లేకపోతే తిండి ముట్టుకోదు. నీళ్లు తాగదు దారా.

కానీ బలమైన ఈ రేసరు తాకిడిని అమ్మగారు తట్టుకోలేరేమో? సతమతమౌతుంటారు యింట్లోవాళ్లు. ఈ విషయాన్ని గ్రహించిన యింటి యజమాని దారాను తమ గదిలోకి అంటే బంగళాపైకి తెచ్చే బదులు అమ్మగారే వో పూట అక్కడికి వెళ్లి చూస్తే సరిపోతుంది గదా! అన్నారు.

ఈ సజెషన్ అందరికీ నచ్చింది. నానమ్మతో అందరూ పట్టన్‌గా వెళ్లవచ్చు. హద్దులు పెట్టడానికి అమ్మలువుండరు. ఇంకేం? ఆటవిడుపు! ఇష్టారాజ్యం అంటూ సంతోషించారు పిల్లలు.

పెద్దావిడ అన్నపూర్ణాదేవికి కూడా కొంత వాకింగ్ చేసినట్లూ వుంటుంది. బయలు పారజూసినట్లూ అవుతుందని కోడళ్లు అంగీకరించారు.

రేసరు గారి సంతోషానికి మేరలేదు. భక్తుడు శ్రీ పర్వతం ఎక్కాలి శివదర్శనానికి, కానీ తనకోసం శివుడే దిగివస్తున్నాడన్నంత ఆనందం కలిగింది. అయితే తననింకా బంధిచారేం? ఎందుకూ ? పెద్దమ్మ గారంతటి వారు మెట్లు దిగి, కక్ష్యాంతరాలు దాటి తన కోసం వస్తే కట్టివేయడం ఏంటీ ? ఇదేం బాగులేదు! అమ్మగారి స్పర్శతో తాను పులకించాలి, సంతోషంతో ఎగరాలి, తోక ఆడించాలి, గోముగా మూర్కోవాలి, ఆమె శరీరరపు వుప్పును తాను రుచి చూచి కృతజ్ఞతలు చెప్పుకోవాలి, అంతేగాని యీ చిలిపి కుర్రలు తన చెవులు పట్టి ఆడిస్తూ గుర్రాన్ని చేస్తే మాత్రం వొప్పుకోదు. అంతే! పారే నీటిని బంధించినట్లుగా 'దారా' అభీష్టానికి

వ్యతిరేకంగా తాము వచ్చినప్పుడు కట్టివుంచవద్దంటూ ఫర్మానా జారీ చేశారు అన్నపూర్ణాదేవి గారు.

కట్టు విడవగానే దారా పట్టరాని ఆనందంతో గంతులు వేసింది. కొత్తగాలి చెవిలో చొచ్చిన లేగదూడలా దారా పరుగులు పెట్టింది. ఆ యింటికి అటూ యిటూ వో మైలు దూరం వరకు పరుగు తీసింది. తనకిప్పుడు స్వేచ్ఛ లభించింది. అది తన జన్మహక్కు. నిజానికి తాను, అమ్మగారు అన్నపూర్ణా దేవి గారి కోసం కట్టుబడి వుంది. కానీ, లేకపోతే యీ గొలుసులూ గిలుసులూ తనకో లెక్కా? అన్నపూర్ణాదేవి గారొక్కరే కాదు; పాప అంటే కూడా తనకెంతో యిష్టం.

అమ్మో! అలాగే సుభద్రా దేవి గారు - అమెలో నయభయాలూ రెండూ గుప్తంగా వుంటాయి. సరే! ఏదైనా తనకు యీ మాత్రం స్వేచ్ఛలభించింది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అంటూ పరుగులు వారుతూ వుంది.

దారా దారి వెంట వెళ్లుతూ వుంటే సింగపువాసన మూరొక్కన్న చిల్లర జంతువుల్లా తక్కిన చిన్నా పెద్ద కుక్కలన్నీ తోకలు ముడిచి యిళ్ల సందుల్లో దాగుతున్నాయి. ఋతు ధర్మంలో వున్న ఆడకుక్కలు వీరపుషాసక్తలై తమ యౌవనాన్ని ఎత్తు కట్టినట్లుగా మరే యితర సంపర్కాన్నీ వొల్లనంటున్నాయి.

ఇలా ప్రతి నిత్యం అమ్మగారు వచ్చి తనను ఆదరించేదాకా, విచ్చలవిడిగా విజయప్రస్థానాలు జరుపుతూ వుంది. వోవారం దాటింది. వున్నట్లుండి దారా కనిపించలేదు. దారాను ఎవరైనా కట్టిపెట్టడం అసంభవం. మరో ప్రత్యర్థి దారాను ఎదురొడ్డి గాయపరిచిందని ఆలోచించడానికి కూడా గుండెలు కావాలి. మరి? కారణం?

ఇంకొంచెం సేపు దారా కనిపించకపోతే పిల్లలు గగ్గోలు పెట్టేస్తారు. ఇప్పటికే ఏదో పసిగట్టిన పాప అల్లరిగా మారాం చేస్తూ వుంది. ఇంకో పది, యిరవై నిమిషాల్లో పెద్దమ్మగారు మెట్లు దిగివస్తారు. దారా కనిపించక అన్నపూర్ణా దేవిగారు మనస్సు చిన్నబుచ్చుకున్నారంటే, పెద్దయ్యగారు సహించరు. కొడుకులు రంగంలో ప్రవేశిస్తారు. ఎవరెవరికి ఏయే శిక్షలు పడ్తాయో?

విషయం కోడళ్ల వరకూ వెళ్లింది. వాళ్లు చేతులు నలుపుకుంటూ అప్పుడే వార్తను పొక్కనియ్య వద్దంటూ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నేరపరిశోధకురాలిలా సుభద్ర కేసును చేతిలోకి తీసుకుని విచారణ ప్రారంభించింది. ఆ విచారణలో తెలిసివచ్చిన సారాంశాన్ని పురస్కరించుకుని 'దారా'ను ఎవ్వరూ ఎత్తుకు పోలేదు, దాని కాలిగోరుకు కూడా దెబ్బ తగలలేదు. కాని దానికి వయస్సు వచ్చింది. అంటే ?

'అంటే? ఏమీలేదు? వో మూడురోజుల నుండి మన బంగళా వెనక వో ఫర్లాంగ్ దూరాన ఎవ్వరో వో కొత్త వ్యక్తి మరో అందమైన తెల్ల కుక్కను వెంటబెట్టుకుని వెళ్లుతూ వుంటే చూచిన దారా వురుములా వురుముతూ మెరుపులా పరుగెత్తింది. కానీ తాను

వెంటాడుతున్నది మగజాతి కాదు, ఆడకుక్క అంటూ గ్రహించినవెంటనే తన కోపాన్ని విడిచి, ప్రసన్నంగా తోక వూపుతూ తాను మెచ్చి మనసు పడ్డ పిల్లను ఆకర్షించేందుకు ప్రయత్నించే యువకుడిలా పోకడలు పోతూ దాని వెంటపడి నడిచి వెళ్లుతూ వుంటే, చూచిన మనవాళ్లు పరుగెత్తి ఎంతో ప్రయత్నంతో గొలుసులు తగిలించి తీసుకు వచ్చారు. ఈనాడూ మళ్లా ఆ కుక్కను తగిలే వెళ్లివుంటుంది. అంటూ భయ భయంగా చెప్పారు.

ఆ మాట విన్న సుభద్ర, 'పదా! నాముందు నడుస్తూ దారి చూపు' అంటూ దారా జాడ తీస్తూ వెళ్లింది.

అలా వెళ్లిన సుభద్రకు, వో అందమైన చిన్న యింట్లో అత్యంత ప్రణయాసక్తుడైన ప్రియుడిలా ఎంతో లౌల్యంతో వుద్రేకిస్తూ ప్రియురాలు 'మార్వెల్'ను అన్ని కళలతో అలరిస్తూ దారా కనిపించింది.

సుభద్ర వాసన తాకినంతనే తనవారు అంటూ దారా, పరాయివారు అంటూ మార్వెల్ యిద్దరూ తమ భాషలో స్వాగత, తిరస్కారాలు ప్రదర్శిస్తూ మొరగడం ప్రారంభించాయి. ఈ అరుపులు విని, అప్పుడే స్నానం చేసి తడివొత్తుకుంటూ పోతపోసిన విగ్రహంలా వున్న శరత్ యివతలికొచ్చి, ఎదుట, పూచిన మెట్ట తామరచెట్టులా నిల్చిన సుభద్రను చూచి ఏమీ తోచకపోయినా, నాగరికుడిగా 'హలో' అన్నాడు.

ఆ, సదాచారాలేవీ లెక్కచేయకుండా ' ఏ! మిస్టర్! నీకెంత ధైర్యం? మా దారాను యిలా వెంట తీసుకురావడానికి?' అంటూ ముఖమంతా అరుణారుణం కాగా కఠినంగా ప్రశ్నించింది.

ఆమాట విన్న శరత్ ఏ తొట్రుపాటూ లేకుండా 'మై డియర్ మ్యాడమ్! యిక్కడ ఎవరూ ఎవరినీ బంధించి తేలేదు. యౌవనం అలా చేసింది. ఇందులో తప్పెవరిదీ కాదు' అంటూ కళ్లలో గర్వరేఖ నర్తిస్తూ వుంటే సన్నగా నవ్వుతూ చెప్పాడు. తనకు అలవాటు లేని, ఎదుటి మనిషి నిర్లక్ష్య వైఖరిని చూచి మండిపడుతూ రేసరును వుద్దేశించి వ్రేలుతో శరత్‌ను సంకేతిస్తూ 'రేసర్' అన్నది.

ఆ మాటతో ఎనర్జైజ్ అయినట్లు ముందుకు లంఘించ బోయిన రేసర్‌ను అడ్డుకుంటూ 'మార్వెల్' శరత్‌కు అడ్డంగా ముందటి రెండు కాళ్లు పైకెత్తి ఆలీఢ పాద ఐనిల్చిన సత్యభామలా మారింది.

తన ప్రియురాలికి శరత్ యిష్టుడని గ్రహించిన దారా చల్లబడుతూ తెల్లజెండా ఎత్తిన యోధుడిలా మార్వెల్ అభిముఖ్యాన్ని భజించడం ప్రారంభించింది.

ఈ సంఘటన యింతకింతకు శరత్ ముఖాన్ని వికసింపచేస్తూ వుంటే, తాను ఏలినబంటు తన మాట వినకుండా ఎవడో ? కోన్‌కిస్కాగాడి ముందు తలవొంపులు తెస్తుందా?

ఏమిటీ వైపరీత్యం ? అంటూ, భయంతో వొణికి పోతూ వున్న పరిచారకుణ్ణి వుద్దేశించి ఈ, మనదారాను గొలుసుకట్టి తీసుకెళ్లు. ఇంకెప్పుడు గొలుసు విప్పకేం?' అంటూ ఆజ్ఞాపించి, శరత్‌ను చురచుర చూస్తూ వెళ్లి పోబోతున్న సుభద్రను ఆపుతూ చేయి ముందుకు సాచి 'లెటజ్ బి ఫ్రెండ్స్ యిందులో నా దోషం ఏమీ లేదు. మళ్లా మీరే వస్తారు. మీకు రాక తప్పదు. గుడ్‌బై' అంటూ యీ సారి చిలిపిగా సుభద్ర కళ్లలోకి చూచాడు.

ఆ చూపు తనలో ఏదో విద్యుత్తరంగాలను పంపిస్తూ వుంటే, మారుమాటైనా మాట్లాడకుండా ఆ యిల్లు కదిలి వచ్చేసింది సుభద్ర. కోపంతో కంపించి పోతూ.

ఇంట్లో దారా పై నిఘా ఎక్కువైంది. అన్నపూర్ణా దేవిగారు కూడా దారాను స్వేచ్ఛగా వదుల వద్దన్నారు. నిర్నిబద్ధంగా, దారాకు స్వాతంత్ర్యం కల్పించడానికి ఆ యింటిలో వున్న ప్రతిప్రాణీవ్యతిరేకించారు. పాపం దారా యిప్పుడు ఆ నాలుగు గోడల మధ్య బందీగా వుంటూంది. తన విముక్తి కోసం పోరాడింది. మొరిగింది. గొలుసు తెంపుకునే ప్రయత్నంతో పెనుగులాడింది. గింజుకున్నది. చివరకు కాలికి గాయం చేసుకుని, అన్ని ప్రయత్నాలూ వమ్మకాగా, విరహభారంతో క్రుంగిపోతున్న ప్రేమికుడిలా దీనంగా దినం వెళ్లబుచ్చుతూ వుంది.

అన్నపూర్ణమ్మగా రొచ్చారు. దారా, సడీచప్పుడు లేకుండా నిర్లిప్తంగా కనిపించింది. పాప, వచ్చింది. చెవులు పట్టి ఆడించింది. ఏ చలనమూ కనిపించలేదు. వుదయం ఒక్కపూట పాలు మాత్రమే తాగుతుంది. అంటే భోజనం మానేసిందన్నమాట. ఆనాడు యింటి పెద్ద సూర్యనారాయణగారు కూడా దారాను పరామర్శించి వెళ్లడానికంటూ బయలు దేరి వచ్చారు. రెండు రోజుల్లో దారా సగం చిక్కిపోయి కన్పిస్తూంది.

సుభద్ర పెను తుఫానులా వచ్చి అలానే వెళ్లిపోయినప్పటినుంచీ శరత్‌లో ఏదో కాంక్ష, ఏదో నిరీక్షణ, ఏదో చెప్పలేని తియ్యని వ్యధ ప్రారంభమైంది. తొలుత ఏ ధ్యేయమూ లేదు. ఏ కోరికాలేదు.

నిజానికి మామూలు పరిస్థితుల్లో సుభద్ర ప్రవర్తన అనాగరకమై సభ్యతారుచికి దూరమై స్నేహ పాత్రంకాక వెగటు అనిపించవలసిందే! కానీ యీ ప్రత్యేక సందర్భంలో మాత్రం తెలిసీ తెలియక ఆటకోలుగా నిప్పుగుండంలో దూకినట్లు శరత్ ఆమెను గూర్చి ఆలోచిస్తూ ఆ వలయంలో చిక్కుకు పోయాడు. తన్నుతాను తెలుసుకునే వరకు సుభద్ర తన బుద్ధి అహంకార చైతన్యాలను ఆవరించి అంతా ఆమె అయి కూర్చుంది.

'ఏమిటీ కోరిక ?' యిది తన పరిమితికీ తాహతుకూ మించిన విషయం. తాను విద్యావంతుడూ, రూపసే ! కానీ ఎదుటి వారి అంతస్థు వేరు. ఇంతకూ ఆమె మనస్సులో తనకే మాత్రం చోటు లేదు. కనీసం కన్నెత్తి ఐనా తన వంక చూడలేదు. వడగండ్లు వర్షించినట్లు చెడాపెడా మాటలు రాల్చి, మెరుపులా వచ్చి వెళ్లిపోయింది' అంటూ ఆ దినం రాత్రి అంతా గడిపాడు. తెల్లవారింది. ఇంట్లో ఎవ్వరూ లేరు. కరక్‌పూర్‌లో ఇంజనీరింగ్ (ఎలక్ట్రానిక్స్) పూర్తి చేసి సెలవుల్లో మేనమామను చూచి పోదామంటూ వచ్చే వరకు అత్తా మామలు టూరు

వెళ్లారు. ఈనాడో రేపో వస్తారు. వారి రాక కోసం వేచివుంటానంటూ యీ నాల్గు రోజులూ వొక్కడే వుంటున్నాడు. విచిత్రమైన సంఘటనలో చిక్కుకున్నాడు.

శరత్ లేచేవరకు సన్నగా జ్వరం తగిలినట్లనిపించింది. మామూలు పరిస్థితుల్లో అయితే అదో లెక్కలోనిది కాదు. కానీ యీ సారి తన స్థితి వింతగా వుంది. మాటిమాటికి సుభద్ర మనసులో మెదుల్తూ వుంది. ఆ స్మృతి తన శరీరాన్ని నఖశిఖ పర్యంతం జల్లుమంటూ పులకింప చేస్తుంది. ముఖం కడుక్కుని అద్దం ముందు నిల్చున్నాడు. సన్నగా పెరిగిన తన గడ్డం, తనకే నవ్వు తెప్పించింది. ఏదో ఆ బాధానుభవంలో అనిర్వచనీయానందం.

వింతైన స్త్రీ ఆకర్షక శక్తిని గూర్చి ఆలోచిస్తూ 'వోమహాశక్తీ, పరమసౌందర్యకళా! రమణీయతా స్ఫూర్తి! నీకివే నా జోహారులు' అంటూ నిజంగానే చేతులెత్తి నమస్కరించాడు. మార్వెల్ కూడా దీనంగా వుంది. ఆడుకోవాలని లేదు. తన కోసం ఏర్పాటైన యినుప చువ్వల యింట్లో ఏదో వాసన కోసం వెతుక్కుంటూ వుంది. ఆ యింట్లో వుండే అటెండర్ తనను ప్రేమగా ఆదరిస్తున్నాడు. కమ్మటి భోజనం వండి వొడ్డిస్తున్నాడు. అయినా తనకెందుకో రుచించడం లేదు.

శరత్‌కన్నా తనవారెవరున్నారు ? మరి శరత్ దగ్గరే వున్నాడు కదా ? అయినా ఈ వెలితి ఏమిటీ ? అబ్బో! నా మనస్సు దారా గారిని గూర్చి ఆలోచిస్తుందా ? అవును! దారా! ఎంత అందంగా వున్నాడు. నన్నెలా లాలించాడు. పాపం! నా కోసం తన యజమానురాలు, కోపగొండిని కాదని గొలుసుల్లో చిక్కాడు. ఆ శరీరపు స్పర్శ ఎంత వెచ్చగా హాయిగా బలంగా వుందో? ఆ సొగసు చూడాలంటే నేను నా ముఖాన్ని పైకెత్తి చూడాల్సి వచ్చింది. అప్పుడు అనుకోకుండా నా శరీరం దారాకు మరింత దగ్గరైంది. అయ్యో! అప్పుడు చంద్రికా సమానంగా ధవళమైన నా ముఖంలో ఎర్రటి తళుకు కనిపించిందని, దారా నన్ను ఆట పట్టించాడు. అమ్మో! మాట నేర్పరి! నేనెంత సిగ్గుపడ్డానో? తల్చుకుంటేనే ఏదో విచిత్రానుభూతి కల్గుతూ వుంది. శరీరం గగురు పొడుస్తూ వుంది.

అవునూ! కొంపదీసి మా శరత్ కూడా ఆ అహంకారి సుభద్రా దేవి కంటి ఎరుపుల్లో మదనయ్య పూల బాణపు వొడుపును చూడలేదు కదా? లేకపోవడం ఏమిటి? అంతే జరిగింది. ఇప్పుడెలా? దారా అయినా కనిపించివుంటే చెప్పివుండేదాన్ని. నా తిక్క కాకపోతే దారా ఏదో పెద్దగా నా వాడై, నా మాట విన్నట్టు !

సరే! యీ తర్జన భర్జన లెందుకు మా శరత్‌ను చూచి వస్తానంటూ గబాగబా నడుస్తూ శరత్ పడుకున్న మంచం పక్కకు చేరి కుయి కుయి మంటూ నిల్చుంది.

ఇప్పుడు దారా పూర్తిగా ఆహారం మానేసి మూడు రోజులైంది. తనను చూట్టానికి ఎవరు వచ్చినా తోక వూపుతుందే తప్ప మరే విధమైన స్పందనా కనబర్చదు. ఏదో జ్ఞాపకం చేసుకుంటూ కన్నీరు కార్చినట్లు కళ్లలోనుండి నీరు స్రవిస్తూ వుంది. సుభద్రను చూడగానే తోకా ఆడించదు. కన్నీరూ కార్చదు. ముఖం అవలి వైపుకు తిప్పుకుని మౌనంగా పడుకుంటుంది.

అసలు విషయం సుభద్రకు తప్ప మరెవ్వరికీ తెలియదు. శరత్ యింటికి తాను వెళ్లినట్లు కూడా యింట్లో ఎవ్వరికీ తెలియనివ్వలేదు సుభద్ర. మొదటి మారుగా సాహసించి గోరంత విషయం కొండంతలు చేసి పెద్దవారికి ప్రమేయం కల్పించకూడదంటూ సుభద్ర తొక్కరాని కడప తొక్కింది. అందుకే ఆ విషయం గుప్తంగా వుంచింది.

ఇప్పుడు మరో వుపద్రవం వచ్చి పడింది. దారా స్థితి పరమ దయనీయంగా మారింది. 'పాపం అనవసరంగా దానికి యిష్టమైన జతను దూరం చేసి బలవంతంగా తెచ్చాను. ఇప్పుడెలా? మార్వెల్‌ను చూస్తేగాని దారా కోలుకోదు.

ఆ పొగరుగిత్త శరతు మార్వెల్‌ను తీసుకుని వాకింగ్ కూడా మానేసినట్లున్నాడు. అవును మరి! తానెవ్వరనుకున్నాడు. ఈ యింటి పేరు తెలిసి హడలి వుంటాడు. అందుకే యీ దరిదాపుల్లో కూడా కనిపించడం లేదు. అయినా శరత్ అంత పిరికి పిండంలా కనిపించలేదే! ముఖవర్చస్సు కూడా దీప్తి మంతంగా వుంది. ఆ కళ్లల్లో తొణికిసలాడిన ఆ గర్వరేఖ, పెదాలపై సన్నగా నర్తించిన ఆ నవ్వు, వో మైగాడ్! మళ్లా నేను ఏదో మాయలో చిక్కుకున్నట్లే వున్నాను.

ఇంకా చిక్కుకు పోలేదని ఏం నమ్మకం? వద్దు వద్దంటూనే వైరభక్తిలా నన్నా శరత్ ఆక్రమించుకుని ఆధిపత్యాన్ని నెరపుతున్నట్లు కనిపిస్తుంది. నా విషయం పోనీ, రిక్వెస్ట్ చేస్తే మార్వెల్‌ను పంపిస్తాడనుకుంటాను. మార్వెల్‌ను తీసుకు వస్తే మా దారా బాగౌతాడు. ఇంట్లో రెండో మనిషి చెవిలో పడకుండా యీ పని నిర్వహించాలి' అంటూ శరత్ యింటికి లింగడిని వెంట తీసుకొని వెళ్లింది.

అక్కడకు వెళ్లగానే యింటి ముందు మార్వెల్ కనిపించలేదు. కాపలాగా వున్న జవాను చూచి అమ్మగారు మీరా ? అంటూ గజగజలాడుతూ శరత్ వున్న గదిలోకి తీసుకువెళ్లాడు. కొత్త వాసన మూర్కొన్న మార్వెల్ మంచం దూకి వచ్చి మొరగడం ప్రారంభించింది.

ఈ సారి మొరగడం పరాయి వారనే హెచ్చరిక గా కాక, తనకు యిష్టమైన వారికి సంతోషంగా స్వాగతం చెప్పినట్లుంది.

మార్వెల్ మొరగడంతో ఆ వైపునుండి యీ వైపుకు తిరిగిన శరత్ ఎదురుగా వున్న సుభద్రను చూచి, తనింకా భ్రమిస్తున్నాననుకుని కళ్లు నలుపుకుంటూ 'హే భగవంతుడా ! ఏమిటీ యిల్యూజన్? యీ ఎండమావుల దోబోచులాటతో జీవించే వోపిక నాకు లేదు. I cant bear this sweet pain. అంటూనే నిదానించి చూచాడు.

నిజంగా సుభద్ర!

వుత్సాహంగా లేచి కూర్చుంటూ 'హలో! సుభా! భాగున్నావా ? యీ మా కుటీరం పావనం చేయడానికి దేవతలా వచ్చావ్. మీ దారా ఎలా వున్నాడు ? పాపం! మా మార్వెల్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నాడా? కాక మీలాంటి ఆగర్భ శ్రీమంతుల పెంపకంలో, రాగాను రాగాలను కూడా చంపుకుని హాయిగా వున్నాడా ?

మా మార్వెల్ చిన్నది, పంచబాణుని పరాక్రమం పూర్తిగా అవగాహన కాకపోయినా, ఏదో అనుభూతితో, తియ్యని అనుబంధంకోసం ప్రాకులాడుతూ వున్నట్లు కన్పిస్తూ వుంది.

ఆ! నన్ను క్షమించండి. జ్వరతీవ్రతలో నాకేదో మతిభ్రమణం కలిగినట్లుంది. వెర్రిగా మాట్లాడుతున్నాను. అడగకుండానే ప్రసాదించిన యీ మీ అనుగ్రహానికి కారణం? అంటూ గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతున్నాడు.

సుభద్ర వూహించింది వేరు, చూస్తున్నది వేరు, ఏ మూలో, ఎక్కడో? జాగృతమై, మిన్కుమిన్కుమంటూన్న రాగభావన, యీ సన్నివేశంతో ప్రజ్వలనాన్ని పొందుతూ రసస్థాయిని పొందేట్లుంది.

శరత్‌ను ఆ స్థితిలో చూచిన సుభద్రకళ్లలో కోపంకానీ, అసహ్యం కానీ కనిపించలేదు. కన్నీళ్లు నిండుకున్నాయి. ఆమె మెల్లమెల్లగా శరత్‌ను సమీపించి నుదుటిపై చెయ్యివేసి, 'జ్వరంగా వుందా?' అంటూ ప్రశ్నించింది.

సమాధానంగా శరత్ సుభద్ర చేతులను గట్టిగా పట్టుకొని చుంబిస్తూ 'సుభా! నీవు నా ప్రణయ దేవతవు, నాకు తెలియకుండానే నీవు నాలోని అణువణువునా ప్రవేశించి నన్ను వివశుణ్ణి చేశావు. నీలో ఏ ఆకర్షక శక్తో ? తెలియదు. సూర్యతాపం సముద్ర జలాలను పీల్చినట్లుగా నా సర్వస్వాన్ని ఏదో అయస్కాంతశక్తితో ఆకృష్టం చేసి నీ ధ్యాన్నంలో, నీ రూపదర్శనంలో, నీ మననంలో సంలీనం పొందించింది. ఏ శిక్ష విధిస్తావో? నాకు తెలియదు' అంటూ ఆవేగంగా ముగించాడు. పాపం సుభద్ర! విధిప్రేరణతో తనకు తానైన నడుస్తూ వచ్చి, కణకణలాడే నిప్పుకలగుండంలో కాలూనింది.

మన్మథ సార్వభౌమునికి కావలసినంత విభావనా సామగ్రి లభించింది. శృంగారం పూర్వరాగ రంజితం కాబోతూంది. చివరకు మార్వెల్‌ను తీసుకు వెళ్లమన్నాడు శరత్ కానీ,

మార్వెల్ ఎంత మాత్రం వొప్పుకోలేదు. ' ఇష్టం వుంటే? దారా స్వయంగా రావాలి కానీ, యీ బలవంతం ఏమిటీ? అన్నట్లు తనను ముట్టుకో నివ్వలేదు. ఇంతకింతకు సమయం దాటిపోతూ వుంది. 'చిన్నమ్మగారండీ! వెళ్లుదామా? అంటూ లింగడు పిలిచాడు. ఆ పిలుపుతో యధాస్థితికి వచ్చిన సుభద్ర 'శరత్! ఆరోగ్యం జాగ్రత్త!' అంటూ హెచ్చరికలు పలికి వెళ్లిపోయింది.

తన మార్వెల్ వాసనతో మరింత ప్రియమైన సుభద్ర రాగానే ప్రణయ లేఖను మోసుకువచ్చిన దూతికలా దారా హృదయానికెంతో సన్నిహితురాలైంది. ఎంతో సేపు సుభద్ర శరీరాన్ని మూర్కొంటూనే గడిపింది. ఇలా ఆ రోజు గడిచింది.

తెల్లవారింది. ఎవరి పనులల్లో వాళ్లు నిమగ్నమై వున్నారు. వున్నట్టుండి దారా విజృంభించడం మొదలైంది. ధ్వని అంతకంతకు అధికమౌతూ వుంది. ఇంటి ముందు నంగనాచి

వంటి మార్వెల్‌ను పట్టుకుని వో పాలవృక్షం లాంటి యువకుడు ప్రవేశాన్ని కాంక్షిస్తూ నిల్చున్నాడు. పైగా పేరుపెట్టి సుభద్రాదేవి కావాలి అంటున్నాడు. ఎన్ని గుండెలు? ఎంత ధైర్యం? అంటూ కాపలావాడితో సహా అందరూ హడిలిపోతున్నారు. అయినా వార్త పెద్దవారికి చేరవేయక తప్పలేదు.

సరిగ్గా ఆ సమయానికే అన్నపూర్ణాదేవిగారు, తానే స్వయంగా పాలుపట్టుకుని దారా చేత తాగిస్తానంటూ వచ్చారు. వెంట పాప, బాబులూ కోడళ్లూ, సుభద్రా వున్నారు. వార్త విన్న అన్నపూర్ణాదేవి గారు ' ఆ అబ్బాయి ఎవరో? లోపలికి రానివ్వండి' అన్నది. శరత్ సవినయంగా గృహలక్ష్మిలా వున్న అన్నపూర్ణాదేవికి నమస్కరిస్తూ నిల్చున్నాడు. మార్వెల్ శరత్ చేతినుండి ఎప్పుడో జారి దారాను అనునయిస్తూంది. వారిద్దరి ఆనందానికి మేరలేదు.

దారా కట్లు విడిపించారు అన్నపూర్ణమ్మగారు. ఆ జంటకు ఏకాంతం కల్పిస్తున్నట్లుగా 'కాఫీ తాగుదువుగాని రా నాయనా' అంటూ పెద్దమ్మగారు శరత్‌ను అంతఃపురం లోపలికి ఆహ్వానించారు.

సుభద్ర సంతోషంతో వుక్కిరి బిక్కిరి ఔతూవుంది. నిటారుగా నిలబడే భద్ర సిగ్గుతో వంకర్లు తరుగుతూ వుంది. చెంపలు కెంపెక్కుతున్నాయి. శరీరం చెమటలు పోస్తూవుంది.

ఇదంతా గమనిస్తున్న చిన్న కోడలు పెద్ద కోడలితో ''అక్కా! యీాయన ఎవరో కపట తపసి వేషంలో వచ్చిన అర్జునిడిలా లేడూ ?'' అన్నది. అర్జునుడే ఎందుకు ? దమయంతి కోసం వచ్చిన నలుడిలా వున్నాడు. రేపో మాపో పచ్చని పందిళ్లలో సన్నాయి వాద్యాలు వినిపిస్తాయి''. అంటూ గొల్లుమంటున్నారు.

ఇంతలోకే రెండో అన్నయ్య ప్రవేశిస్తూ 'హలో శరత్!' అన్నాడు. అందరూ ఆశ్చర్యంలో మునిగి తేరుకునే వరకు పిల్లలు.

'మా అత్తయ్య పెళ్లికూతురాయెనే' అంటూ పాడుతున్నారు. సుభద్ర రెండు చేతులా దారా మార్వెల్‌లను అలుముకున్నది.